





Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

గురువారం 12-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :144 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

## కృష్ణా ప్రాజెక్టులపై కేఆర్ఎంబీ కొరడా!




2 లో

ప్రాజెక్టుల అసలు వివరాలు సమర్పించాలి

శ్రీశైలం, సాగర్‌పై ప్రత్యేక దృష్టి

కొత్త ప్రాజెక్టుల అనుమతులపై ఆరా

విస్తరణలు, నీటి అవసరాలపై సమీక్ష

ఆధారాలతో పూర్తి సమాచారం ఇవ్వాలి

## పదవుల పంచాయితీ.. 69 మంది జాబితా రద్దు!

కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ

69 మందితో జాబితా నిలిపివేత

అధికార ప్రతినిధుల నియామకంపై రచ్చ

బీఆర్ఎస్ అనుకూలులకూ పదవులా?

ఏకపక్ష ఎంపికపై సీనియర్ల అభ్యంతరాలు

ఏఐసీసీ పరిశీలనలో నియామకాల జాబితా



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ పార్టీలో అధికార ప్రతినిధుల నియామకం రచ్చ లేపింది. జంబో అధికార ప్రతినిధుల నియామకంపై పార్టీలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైనట్లుగా తెలిసింది. బీఆర్ఎస్?పార్టీకి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పదవులా? అంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జాబితాలో కొందరు కనీస స్థాయిలో విషయ పరిజ్ఞానం లేనివారిని ఎలా నియమిస్తారని, వారు ఏదైనా పొరపాటుగా మాట్లాడితే పార్టీ, ప్రభుత్వం ఇరకాటంలో పడాల్సి వస్తుంది కదా అంటూ పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. టాలెంట్ హంట్ పేరుతో నిర్వహించిన వారి జాబితా ఏఐసీసీ వద్ద పెండింగ్‌లో ఉండగా ఎలా ప్రకటిస్తారని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో చివరికి జాబితాను నిలిపివేశారు. దీనిపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీకి పలువురు ఫిర్యాదులు చేసినట్లుగా తెలిసింది. దీంతో ఆ జాబితాను నిలిపివేయాలని, ఆ జాబితా అమల్లోకి రాదంటూ పార్టీ ప్రకటించింది.

2 లో

## మరో అల్పపీడనం.. దక్షిణాదికి వర్ష గండం!

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

దక్షిణాది రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక

13న అల్పపీడనం ఏర్పడే అవకాశం

ఏపీకి మూడు రోజుల పాటు వర్షాలు

తమిళనాడు, కేరళలో భారీ వర్షాలు

తుఫానుగా మారుతుందా? ఉత్కంఠ

2 లో

కశ్మీర్‌లో వర్షాలు, హిమపాతం హెచ్చరిక

## ఏపీ రాజకీయాల్లో కొత్త అధ్యాయం

175 స్థానాల్లో పీఆర్పీ పోటీ

యువతకు 66 శాతం టికెట్లు

సామాజిక న్యాయమే పార్టీ లక్ష్యం

ఆలయ పాలక మండళ్లపై కీలక వ్యాఖ్యలు

అప్పులపై చంద్రబాబు, జగన్‌కు ప్రశ్నలు

అవినీతి రహిత రాజకీయాలే ధ్యేయం




న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) అధ్యక్షుడు విజయసాయిరెడ్డి కీలక ప్రకటనలు చేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాల్లోనూ తమ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తామని, యువతకు 66 శాతం రాజకీయ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. కుల, మతాలకు అతీతంగా యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన పార్టీ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు.

2029 ఎన్నికల్లో పీఆర్పీ మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని విజయసాయిరెడ్డి బలంగా చెప్పారు.

2 లో

## పట్టాలు తప్పిన కోల్‌కతా-సైరంగ్ ఎక్స్‌ప్రెస్

పట్టాలు తప్పిన 7 బోగీలు

ఉదయం 6.54 గంటలకు ఘటన

ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ప్రాణనష్టం లేదన్న రైల్వే అధికారులు

సహాయక చర్యలు ముమ్మరం

ట్రాక్ పునరుద్ధరణ పనులు షురూ

2 లో

## కేదార్‌నాథ్ ఆలయం మూసివేత

6 నెలల ఉఖీమఠ్‌లోనే నిత్య పూజలు

శీతాకాలం కోసం కేదార్‌నాథ్ మూసివేత

ఉదయం 8.30 గంటలకు ఆలయ ద్వారాలు బంద్

ఉఖీమఠ్‌కు బయలుదేరిన ఉత్సవ డోలీ

ఆరు నెలలు అక్కడే నిత్య పూజలు

భక్తుల జయజయధ్వానాల మధ్య ముగింపు వేడుకలు

రంగురంగుల పూలతో ఆలయ అలంకరణ

చార్‌ధామ్ యాత్రకు భారీగా భక్తులు

2 లో

## పాల ధరలకు రెక్కలు.. లీటర్‌పై రూ.4 పెంపు!



2 లో

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం): నిత్యావసరాల ధరల మోతతో ఇప్పటికే సతమతంఅవుతున్న సామాన్యుడికి మరో షాక్ తగలబోతోంది. ప్రముఖ పాల సరఫరా సంస్థ 'మదర్ డెయిరీ' పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 నుంచి రూ.4 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ఈ కొత్త ధరలు గురువారం (నవంబర్ 12) నుంచి అమల్లోకి రానున్నాయి. రైతుల నుంచి పాలు సేకరించే ఖర్చులు, ఇతర ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్లే ధరలను సవరించాల్సి వచ్చిందని మదర్ డెయిరీ పేర్కొంది.

## అప్పులకు ఊరట రుణాలకు బాట!



- రబీకి రూ.38,268 కోట్ల రుణాలు
- పాత అప్పులకు గడువు పొడిగింపు
- 365 మండలాల్లో కరువు సెగ
- రైతులకు రుణ ఊరటపై ఫోకస్
- కౌలు రైతులకూ బ్యాంకు రుణాలు
- 60 నెలల వరకు చెల్లింపు వెసులుబాటు
- తక్కువ నీటి పంటలకు ప్రోత్సాహం
- బ్యాంకుల చుట్టూ తిరగొద్దు..రైతుల వద్దకే బ్యాంకర్లు

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం): ఒకవైపు రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటడం.. మరోవైపు బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో రబీ సాగు రైతులకు సవాల్‌గా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి కోసం కొత్త అప్పులు చేయాలా? ఇప్పటికే తీసుకున్న పంట రుణాలు ఎలా చెల్లించాలా? అన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. ఈ రెండు సమస్యలకు ఒకేసారి పరిష్కారం చూపేలా ప్రభుత్వం బ్యాంకర్లపై ఒత్తిడి పెంచుతోంది. పాత పంట రుణాల చెల్లింపుల భారాన్ని తగ్గించడంతోపాటు, రానున్న రబీ సాగుకు కొత్త రుణాలను సకాలంలో అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకులను కోరారు. రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బ్యాంకర్లే క్షేత్రస్థాయికి వచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు రూ.38,268 కోట్ల పంట రుణాల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాటిని వేగంగా మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2026 సెప్టెంబర్ నాటికి రూ.96,943 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంలో 53 శాతమే చేరడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

## లోపల దోస్తీ.. బయట కుస్తీ

ఎమ్మెల్సీ ఎన్నికలతో అధికార, విపక్షాలకు సవాల్

గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలి

బీఆర్ఎస్, బీజేపీపై కవిత విమర్శలు

కాంగ్రెస్‌తో బీఆర్ఎస్‌కు లోపాయికారీ దోస్తీ

డబ్బుతో గెలవాలనుకుంటున్నారంటూ ఆరోపణ

బీసీ యువతకు ఎమ్మెల్సీ టికెట్లు

సామాజిక న్యాయానికి పెద్దపీట




2 లో

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం): అధికార పక్షాన్ని, నిద్రలో ఉన్న ప్రతిపక్షాలను ప్రశ్నించేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక మంచి అవకాశమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనలు నిర్వహించి, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఆశీర్వాదంతో పాటు వీర తిలకం దిద్ది ఆమె అధికారికంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దగాపడ్డ సమూహాలుగా మనం ఆలోచించుకునే సందర్భం వచ్చిందని, రాష్ట్రంలో ఏదో ఒక డిగ్రీ ఉన్నవారు 80 లక్షల మంది ఉన్నారని, ఇప్పుడు 75 నియోజకవర్గాల్లో (75 శాతం తెలంగాణ) ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు.

## పండుగొస్తే చార్జీల మోత.. హైకోర్టు సీరియస్!




పండుగ వేళ బస్సు చార్జీల మోత

ప్రైవేట్ ట్రావెల్స్‌పై హైకోర్టు సీరియస్

అధిక ఛార్జీల నియంత్రణకు ఆదేశాలు

ఎనిమిది వారాల్లో నిర్ణయం తీసుకోవాలి

బస్సుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి

ప్రయాణికులకు ఊరట లభించేనా?

2 లో

## మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం

మైనార్టీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

స్కాలర్‌షిప్‌లపైనా బీజేపీ రాజకీయం

మైనార్టీ రిజర్వేషన్లపై రేవంత్ ఘాటు వ్యాఖ్యలు

యువత నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మైనార్టీల ఓట్ల తొలగింపునకు కుట్ర: సీఎం

బీఆర్ఎస్‌పై రేవంత్ పరోక్ష సెటైర్లు



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం): దేశంలో మైనార్టీలకు ఇచ్చే స్కాలర్‌ల్‌షిప్స్ కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం రేంత్ రెడ్డి ప్రశ్నించారు. బంజారా హిల్స్‌లో ఉన్న బంజారా భవన్‌లో జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మైనారిటీలకు అన్ని వేళలా, అన్ని రకాలుగా పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో విద్యా, నీటిపారుదల రంగాలకు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు.

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 12-11-2026

# పాల ధరలకు రెక్కలు.. లీటర్‌పై రూ.4 పెంపు!

మొదటి పేజీ తరువాయి

**లీటర్ పాలు రూ. 76**

ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో అతిపెద్ద పాల సరఫరాదారుగా ఉన్న మదర్ డెయిరీ గతంలో 2026 మే 14న పాల ధరలను పెంచింది. అంతకుముందు 2025 ఏప్రిల్‌లో ధరలను సవరించింది. పాల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో 75 నుంచి 80 శాతం వరకు రైతులకే చెల్లిస్తున్నామని ప్రస్తుతం సేకరణ ధరలు పెరగడంతో ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపాల్సి వచ్చిందని సంస్థ వర్గాలు తెలిపాయి.

**పెరిగిన కొత్త ధరల వివరాలు (ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో):**

ఫుల్ క్రీమ్ మిల్క్ (ప్యాకెట్): లీటరు రూ. 72 నుంచి రూ. 76కు పెరిగింది.

ఆవు పాలు: రూ. 62 నుంచి రూ. 65కు చేరింది.

టోన్డ్ మిల్క్ (ప్యాకెట్): రూ. 60 నుంచి రూ. 62కు పెరిగింది.

టోన్డ్ మిల్క్ (బల్క్ వెండెడ్/లూజ్): రూ. 58 నుంచి రూ. 60కి పెరిగింది.

డబుల్ టోన్డ్ మిల్క్: రూ. 54 నుంచి రూ. 56కు చేరింది.

**రోజుకు 50 లక్షల లీటర్లు:**

మదర్ డెయిరీ దేశవ్యాప్తంగా రోజుకు 50 లక్షల లీటర్లకు పైగా పాలను విక్రయిస్తుండగా, కేవలం ఢిల్లీ-ఎన్సీఆర్ మార్కెట్లోనే రోజుకు సుమారు 35 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోంది. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ అనుబంధ సంస్థగా 1974లో ప్రారంభమైన మదర్ డెయిరీ.. గత ఆర్థిక సంవత్సరంలో 17 శాతం వృద్ధితో రూ. 20,300 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. ఈ సంస్థ 'మదర్ డెయిరీ' బ్రాండ్ పేరుతో పాలు, 'ధార' పేరుతో వంటనూనెలు, 'సఫల్' పేరుతో పండ్లు, కూరగాయలను విక్రయిస్తోంది.

# ఏపీ రాజకీయాల్లో కొత్త అధ్యాయం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని, పార్టీ తరఫున 66 శాతం టికెట్లు యువతకు కేటాయిస్తామని ప్రకటించారు. కుల, మత భేదాలకు అతీతంగా యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇక, రాష్ట్రంలోని దేవాలయాల నిర్వహణపై సాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆలయాలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారని విమర్శించారు. దేవాలయాల పాలక మండళ్లు రాజకీయ నిరుద్యోగులకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయని ఆరోపించారు. దేవుళ్లపై నిజమైన విశ్వాసం, భక్తి ఉన్న వ్యక్తులకు మాత్రమే ఆలయాల పాలక మండళ్లలో అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. లడ్డూలో కల్తీ జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలు భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. దేవుళ్లపై భక్తులకున్న నమ్మకం, విశ్వాసాల పట్ల గౌరవం లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా మతపరమైన అంశాలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు.

**లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేశారు?**

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై కూడా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ఆదాయం రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు ఎలా చేరిందని ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు రాష్ట్రంలో ఎలాంటి సంపద సృష్టించాయని, లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎందుకు చేశాయని నిలదీశారు. అప్పులు చేయడం మాత్రమే కాకుండా, వాటి ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలిగించారో చెప్పాలని ప్రశ్నించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు రావాలంటే పరివర్తన రాజనీతి పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు.

**అవినీతి, అక్రమాలకు తావులేని రాజకీయాలే లక్ష్యం**

రాష్ట్రంలో స్వచ్ఛమైన రాజకీయ వ్యవస్థను తీసుకురావడమే పీఆర్పీ లక్ష్యమని విజయసాయిరెడ్డి ప్రకటించారు. తమ పార్టీలో అవినీతికి, అక్రమాలకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. క్లీన్ పాలిటిక్స్ కోసం పరివర్తన రాజనీతి పార్టీ పనిచేస్తుందని తెలిపారు. యువతకు అవకాశాలు కల్పిస్తూ అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చేలా పార్టీని నిర్మిస్తామని చెప్పారు. కాగా, విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీకి 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ)గా పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. తెలుపు, కాషాయ రంగులతో రూపొందించిన జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తును ఏర్పాటు చేశారు. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని 175 స్థానాల్లో పోటీ చేయడంతో పాటు యువతకు 66 శాతం అవకాశాలు కల్పిస్తామని ప్రకటించడంతో ఏపీ రాజకీయాల్లో పీఆర్పీపై ఆసక్తి నెలకొంది.

# పండుగొస్తే చార్జీల మోత.. హైకోర్టు సీరియస్!

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం):** పండుగలు, సెలవులు వచ్చాయంటే.. సొంత ఊరు వెళ్లడానికో.. నచ్చిన ప్రదేశాలను చూసేందుకు ప్రయాణాలు పెరుగుతుంటాయి.. అయితే, ఇదే అదునుగా భావించి.. ప్రయాణికుల ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నాయి ప్రైవేట్ ట్రావెల్స్.. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో పండుగలు, సెలవు రోజుల్లో ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచడాన్ని నియంత్రించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై (పిల్) ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రైవేట్ బస్సుల ప్రయాణ ఛార్జీల నియంత్రణకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు వసూలు చేసే గరిష్ట ప్రయాణ ఛార్జీలను నిర్ణయించేందుకు నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సంక్రాంతి, దసరా వంటి పండుగలతో పాటు ఇతర సెలవు రోజుల్లో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు అధిక ధరలు వసూలు చేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల అనుమతులు, బస్సులకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర సమాచారాన్ని ఆన్‌లైన్ యాప్‌లలో ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. తద్వారా ప్రయాణికులకు బస్సుల వివరాలు, వాటి అనుమతులపై పారదర్శకత ఉంటుందని పేర్కొన్నారు.ఈ పిల్‌పై విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. పండుగలు, సెలవుల వంటి రద్దీ సమయాల్లో ప్రైవేట్ బస్సుల ప్రయాణ ఛార్జీలను నిర్ణయించే అంశంపై ఎనిమిది వారాల్లోగా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖను ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఎనిమిది వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో పండుగలు, సెలవు రోజుల్లో ప్రైవేట్ బస్సుల అధిక ఛార్జీల వసూళ్లకు అడ్డుకట్ట పడుతుందా అనే ఆసక్తి నెలకొంది. మరి, హైకోర్టు ఆదేశాలపై ఏపీ రవాణాశాఖ ఎలాంటి స్టెప్ తీసుకుంటుందో చూడాలి.

# మరో అల్పపీడనం.. దక్షిణాదికి వర్ష గండం!



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం):** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో దక్షిణాది రాష్ట్రాలకు ఐఎండీ వర్ష హెచ్చరిక జారీ చేసింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. ఆ అల్పపీడనం 24 గంటల్లో బలపడి వాయవ్య దిశగా కదలనుందని దాని ప్రభావంతో నవంబర్ 14-16 మధ్య కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లో వర్ష సూచన ఉన్నట్టు అంచనా వేసింది. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, అండమాన్ దీవుల్లో పలురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తమిళనాడు తీరంలో గంటకు 40 కి.మీ నుండి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. నవంబర్ 12న కశ్మీర్ లోయలో భారీ వర్షాలు, హిమపాతం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే అల్పపీడనం తుఫానుగా మారుతుందా? అనేదానిపై ఐఎండీ ఇంకా ప్రకటన చేయలేదు. ఇక ప్రస్తుతం వర్షాలు తగ్గిపోయి చలికాలం మొదలైంది. దీంతో ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గుతుండగా, వర్షసూచన ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో మళ్లీ వాతావరణంలో మార్పులు వచ్చే అవకాశం ఉంది.

# కృష్ణా ప్రాజెక్టులపై కేఆర్ఎంబీ కొరడా!

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం):** కృష్ణా జలాల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి తొలుత ఆమోదించిన అసలు వివరాలను సమర్పించాలని కేఆర్ఎంబీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్సీలకు బోర్డు లేఖ రాసింది. ప్రాజెక్టుల అసలు స్వరూపం, ఆ తర్వాత జరిగిన మార్పులు, అదనంగా చేపట్టిన పథకాలు, వాటికి లభించిన అనుమతుల వివరాలను ఆధారాలతో సహా అందించాలని స్పష్టం చేసింది. ప్రధానంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి మూడు విభాగాల్లో పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ప్రాజెక్టుల తొలుత ఆమోదించిన పరిధి, భాగాలు, ఎడమ, కుడి కాలువల ఆఫ్‌టేక్‌లు, వాటి ఆయకట్టు, డిజైన్ డ్రాలు, కమాండ్ ఏరియాలు, నీటి అవసరాలు, సంబంధిత సాంకేతిక నివేదికలు, అనుమతి ఉత్తర్వులు, అసలు ఆమోదించిన సాగునీటి, విద్యుత్, తాగునీటి అవసరాల్లో చేసిన మార్పులు, విస్తరణలు, కొత్తగా చేర్చిన పథకాలు, వాటి డిజైన్, లక్ష్యాలు, అదనపు నీటి అవసరాలు, ఆయా మార్పులు, కొత్త పథకాలకు సంబంధించిన సాంకేతిక అంగీకారాలు, క్లియరెన్సులు, అనుమతుల వివరాలను ఆధారాలతో సమర్పించాలని ఆదేశించింది.

**ఆ కేటాయింపులే ప్రామాణికం..**

2026 అక్టోబర్ 15న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పంపిన లేఖలో కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులు, తొలుత ఆమోదించిన ప్రాజెక్టుల వివరాలే ప్రామాణికంగా కొనసాగుతున్నాయని పేర్కొన్న విషయాన్ని కేఆర్ఎంబీ తన తాజా లేఖలో ప్రస్తావించింది. ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చోటుచేసుకున్న మార్పులను గుర్తించడానికి, పరిశీలించడానికి అసలు ఆమోదిత వివరాలు అత్యవసరమని స్పష్టం చేసింది. శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలో మార్పులు, విస్తరణల అంశం 2026 జనవరి 30న చైర్మన్ అధ్యక్షతన జరిగిన కమిటీ తొలి సమావేశంలో చర్చకు వచ్చినట్లు లేఖలో పేర్కొన్నది. 2021 జులై 15న జారీ చేసిన నోటిఫికేషన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి 11, నాగార్జునసాగర్‌కు సంబంధించి రెండు నాన్-అప్పర్టినెంట్ కాంపోనెంట్లను ప్రస్తావించినట్లు తెలిపింది. అలాగే నాగార్జునసాగర్‌కు సంబంధించిన అంశాలు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నది. కాగా.. 2026 సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 30 వరకు పలు లేఖల ద్వారా రెండు రాష్ట్రాలను అసలు ప్రాజెక్టు వివరాలు కోరినట్లు కేఆర్ఎంబీ గుర్తుచేసింది. అవసరమైన సమాచారం ఇంకా అందలేదని తెలిపింది. ఇదే తరహా వివరాలను నాగార్జునసాగర్‌కు సంబంధించి కూడా కోరినట్లు తెలిపింది. అనుమతి లేని కొత్త ప్రాజెక్టులు, ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల్లో చేసిన మార్పులు, పెరిగిన నీటి అవసరాలపై సమీక్ష నిర్వహించేందుకు అసలు ఆమోదిత ప్రాజెక్టు వివరాలను ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. ఈ సమాచారం రెండు రాష్ట్రాల హక్కులు, అభ్యంతరాలకు భంగం కలిగించకుండా, సంబంధిత న్యాయస్థానాల్లో కొనసాగుతున్న విచారణలకు విఘాతం లేకుండా రికార్డులను పరిశీలించేందుకు అవసరమని పేర్కొన్నది.

# పదవుల పంచాయితీ.. 69 మంది జాబితా రద్దు!

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు పీసీసీ తన ఎక్స్‌ఖాతాలో జాబితా నియామకాలను నిలిపివేసినట్లుగా ప్రకటించింది.

**బీఆర్ఎస్‌కు పనిచేసే వాళ్లకా..**

మరోవైపు జాబితా అంతా ఏకపక్షంగా రూపొందించారని సీనియర్ల నుంచి విమర్శలు వ్యక్తం అయ్యాయి. సోమవారం ప్యానలిస్ట్‌లు, అధికార ప్రతినిధులు, కోఆర్డినేటర్‌లు ఇలా మొత్తం 69 మందితో జాబితాను పార్టీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. జాబితాలో ఉన్న వారితోపాటుగా ఇప్పటికే అధికార ప్రతినిధులుగా ఉన్నవారు సీనియర్ అధికార ప్రతినిధులుగా కొనసాగుతారని ఆయన వెల్లడించారు. దీంతో మొత్తం జాబితా జంబోగా తయారైంది. కొందరు విషయ పరిజ్ఞానం లేనివారిని నియమించడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. అలాగే ఒకరిద్దరు బీఆర్ఎస్?నాయకుల సోషల్?మీడియాకు పనిచేస్తున్నారని నేతల దృష్టికి తీసుకువెళ్లినట్లుగా సమాచారం.

**టాలెంట్ హంట్ ఏమైంది..**

పార్టీకి అధికార ప్రతినిధులుగా నియమితులయ్యే వారు మంచి విషయ పరిజ్ఞానం, ఉండి చురుగ్గా పనిచేసే వారిని నియమంచాలనే ఉద్దేశంతో ఏఐసీసీ టాలెంట్ హంట్ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది. వీరిని ఎంపిక చేయడానికి ఏఐసీసీ నేతలను, రాష్ట్రం నుంచి కొందరితో కమిటీని ఏర్పాటు చేశారు. దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. చురుగ్గా, సబ్జెక్టు ఉన్న వారిని స్క్రీనింగ్ చేసి ఏఐసీసీకి పంపించారు. జాబితాను ఏఐసీసీ మరోసారి పరిశీలించి ప్రకటించాల్సి ఉంది. ఇది పెండింగ్‌లో ఉండగానే ఇక్కడ జంబో అధికార ప్రతినిధులను ప్రకటించడంపైనా అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే జాబితాను ఏఐసీసీ హోల్డ్‌లో పెట్టాల్సి వచ్చిందని సమాచారం. అలాగే కొందరు సూచించిన వారికే జాబితాలో చోటు ఇచ్చారని, పార్టీకి ఎంతవరకు వారి సేవలు అవసరం, అధికార ప్రతినిధులుగా వారు ఎంతవరకు న్యాయం చేయగలుగుతారనే విషయాన్ని పట్టించుకోకుండా, జాబితాను రూపొందించారని ఫిర్యాదులు వెళ్లినట్లుగా సమాచారం.

# కేదార్‌నాథ్ ఆలయం మూసివేత..



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం):** ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు శీతాకాలం కోసం ఇవాళ ఉదయం 8.30 గంటలకు మూతపడ్డాయి. భాయి దూజ్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేద మంత్రోచ్ఛారణలు, సాంప్రదాయ ధార్మిక పూజలు, వేలాది మంది భక్తుల జయజయధ్వనాల నడుమ ఆలయ తలుపులను మూసివేశారు. ఆలయ ద్వారాలు మూసివేసిన అనంతరం, బాబా కేదార్‌నాథ్ పవిత్ర 'చల్ విగ్రహ ఉత్సవ డోలీ' శీతాకాల విడిది కేంద్రమైన ఉఖీమఠ్‌లోని శ్రీ ఓంకారేశ్వర్ ఆలయానికి బయలుదేరింది. శీతాకాలంలో హిమపాతం కారణంగా కేదార్‌నాథ్ వద్ద వాతావరణం అత్యంత శీతలంగా మారుతుంది. దాంతో రాబోయే 6 నెలల పాటు ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర్ దేవాలయంలోనే బాబా కేదార్‌కు నిత్య పూజలు, దర్శనాలు కొనసాగుతాయి. ఆలయ ముగింపు ఉత్సవాల వేళ కేదార్‌నాథ్ ధామ్ ప్రాంగణాన్ని టన్నుల కొద్దీ రంగురంగుల పూలతో ఎంతో సుందరంగా అలంకరించారు. ఈ సంవత్సరం చార్ ధామ్ యాత్రకు రికార్డు స్థాయిలో భక్తులు తరలిరావడం విశేషం.

# పట్టాలు తప్పిన కోల్‌కతా-సైరంగ్ ఎక్స్‌ప్రెస్



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (ఇది కద నిజం):** ఉదయాన్నే ఘోర రైలు ప్రమాదం తప్పింది. అస్సాం రాష్ట్రంలోని గౌహతి సమీపంలోని కామరూప్ జిల్లా దిగారు రైల్వే స్టేషన్ వద్ద కోల్‌కతా-సైరాంగ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఇంజన్‌తో పాటు రైలుకు చెందిన 6 నుంచి 7 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటన ఉదయం 6.54 గంటల ప్రాంతంలో జరిగినట్లు సమాచారం. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే ఈశాన్య సరిహద్దు రైల్వే ఉన్నతాధికారులు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఇప్పటివరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే సీపీఆర్‌వో కపింజల్ కిషోర్ శర్మ తెలిపారు. కానీ, పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు, ట్రాక్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# లోపల దోస్తీ.. బయట కుస్తీ

మొదటి పేజీ తరువాయి

గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా తమ ఓటును ఎన్‌రోల్ చేసుకొని ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ భర్తల వెంటబడి అయినా ఓటు నమోదు చేయించాలని ఆమె కోరారు. గ్రాడ్యుయేట్లు డబ్బులు తీసుకొని ఓట్లు వేస్తారన్న అపవాదు ఉందని, దానిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. చదువుకున్న వారు రాజకీయాల్లోకి వస్తేనే వ్యవస్థ మారుతుందని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు.

**ప్రభుత్వం, ప్రతిపక్షాలపై విమర్శలు**

అసెంబ్లీతో పాటు శాసన మండలిలోనూ కాంగ్రెస్ పార్టీయే ఎక్కువగా ఉందని, బీఆర్ఎస్‌లోని సగం మంది కాంగ్రెస్‌లోకి వెళ్లారని కవిత విమర్శించారు. బీజేపీతో వారికి లోపాయికారీ ఒప్పందం ఉందని, మండలిలో అసలు ప్రతిపక్షమే లేకుండా పోయిందని ఆరోపించారు. మూడుసార్లు గెలిపించినప్పటికీ ఏమీ చేయని బీజేపీకి గుణపాఠం చెప్పే అవకాశం వచ్చిందన్నారు.రూ.200 కోట్లు ఖర్చు పెట్టైనా తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అంటే డబ్బు ద్వారానే గెలుస్తామని నమ్ముతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేసిన అన్ని మోసాలను ప్రశ్నించే విధంగా తమ పోరాటం ఉంటుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, నదీ జలాల వంటి ప్రజా సమస్యలపై తామే పోరాడుతున్నామని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయం, అభ్యర్థుల ఎంపిక**

సామాజిక తెలంగాణ అనే అంశాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించామని కవిత తెలిపారు. తమ ఇద్దరు అభ్యర్థులు బీసీలేనని, వారిలో ఒకరు కాకతీయ విశ్వవిద్యాలయం, మరొకరు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులని చెప్పారు. అభ్యర్థి ఆకాశ్ కొల్లూరి బీసీ కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వారని, ఇప్పటివరకు ఏ పార్టీ కుమ్మరి వర్గానికి అవకాశం ఇవ్వలేదని అన్నారు. రాజకీయ నేపథ్యం లేని, ధనవంతులు కాని చదువుకున్న యువతకు అవకాశం ఇచ్చామని వివరించారు. హైదరాబాద్ సీటును మహిళకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఆకాశ్‌కు ఇచ్చామన్నారు. జనరల్ సీట్లలో కూడా రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు 30 నుంచి 50 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించారు.

**ఎన్నికల సంఘం వద్ద మా పార్టీకి గుర్తింపు:**

ఎన్నికల సంఘం వద్ద తమ పార్టీకి గుర్తింపు వచ్చిందని, మిగతా ప్రక్రియకు సంబంధించి తమ న్యాయవాదులు ఈసీతో మాట్లాడుతున్నారని కవిత వెల్లడించారు. భావసారూప్యత కలిగిన అన్ని పార్టీల మద్దతు కోరుతామని, అభ్యర్థులు గెలిచే వరకు పోరాటం చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

# మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం..

మొదటి పేజీ తరువాయి

నాడు నెహ్రూ వేసిన బలమైన పునాదుల వల్లే నేడు విద్యా, ఇరిగేషన్ రంగాల్లో దేశం గొప్ప వృద్ధిని సాధించిందన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీలు, ఐఐటీ లను కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆనాడు పడిన పునాదుల ఫలితంగానే నేడు భారతీయ యువత ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు సీఈవోలుగా ఎదుగుతున్నారని, ఈ విషయాన్ని నేటి యువత గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం..

ప్రస్తుత కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాలు పెరగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువతలో స్కిల్స్ పెంపొందించేందుకే ఐటీఐ లను ఐటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. మరిన్ని ఆధునిక వసతులతో రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని కూడా నిర్మిస్తున్నట్లుగా వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరగడం వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోందని, అయితే ఏఐ సాంకేతికత ఎంత విస్తరించినా బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సచార్ కమిటీ సిఫార్సుల మేరకు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందని సీఎం గుర్తుచేశారు. బీజేపీ పాలిత గుజరాత్‌లో కూడా మైనార్టీ రిజర్వేషన్లు అమలువుతున్నాయని, కానీ తెలంగాణలో మాత్రం వాటిని తొలగిస్తామని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం

రాష్ట్రంలో మైనార్టీల ఓటు హక్కును దూరం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. సర్ పేరిట భారీగా మైనార్టీలు, ఎస్టీలు, ఆదివాసీలు, నిరుపేదల ఓట్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ విద్యార్థులకు అందే స్కాలర్‌షిప్‌లపై కూడా కాషాయ పార్టీ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ ఒకటేనంటూ బీఆర్ఎస్ చేస్తోన్న ఆరోపణలను సీఎం తిరస్కరించారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్ర మోడీని ఓడించి కేంద్రంలో గద్దె దించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీకి వెళ్లి మోడీ ముందు మోకరిల్లి సాగిలపడింది ఎవరో ప్రజలందరికీ బాగా తెలుసంటూ బీఆర్ఎస్ నేతలపై పరోక్షంగా సెటైర్లు వేశారు.

# అప్పులకు ఊరట.. రుణాలకు బాట!

మొదటి పేజీ తరువాయి

మాన్‌సూన్ ఫార్మింగ్ రుణాల లక్ష్యం రూ.1,329 కోట్లు కాగా, కేవలం 17 శాతమే పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రబీ రుణాల మంజూరులో జాప్యం జరగకుండా చూడాలని బ్యాంకర్లకు సూచించారు.

**చెల్లింపుల గడువు పొడిగించాలి:** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని 365 మండలాలను ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. వీటిలో 111 తీవ్ర కరువు, 254 మధ్యస్థ కరువు మండలాలున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో రైతుల రుణ చెల్లింపు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేపట్టాలని ప్రభుత్వం కోరుతోంది. కరువు ప్రభావాన్ని బట్టి మూడేళ్లు లేదా ఐదేళ్ల వరకు రుణ చెల్లింపుల గడువును పొడిగించే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఐదేళ్ల వరకు గడువు పొడిగింపు అందరికీ ఒకేలా వర్తించదు. ఆర్‌బీఐ 2017 మార్గదర్శకాల ప్రకారం పంట నష్టం 33-50 శాతం మధ్య ఉంటే ఒక ఏడాది మారటోరియంతో కలిపి గరిష్ఠంగా రెండేళ్లు, 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ నష్టం ఉంటే ఒక ఏడాది మారటోరియంతో కలిపి గరిష్ఠంగా ఐదేళ్ల వరకు రుణ చెల్లింపు గడువు పొడిగించవచ్చు. ప్రకృతి విపత్తు సంభవించిన సమయంలోనే బకాయిపడిన స్వల్పకాలిక రుణాలు ఈ రీషెడ్యూలింగ్‌కు అర్హత పొందవు.. అదనపు పూచీకత్తు లేకుండానే అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ కల్పించాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. రీషెడ్యూలింగ్‌పై ఎస్ఎల్‌బీసీ లేదా జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకున్న తర్వాత రైతులకు కొత్త పంట రుణాలు కూడా మంజూరు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలోనూ ఈ ప్రక్రియకు సంబంధించిన చర్యలు మొదలయ్యాయి. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.1,778 కోట్లకు పైగా వ్యవసాయ రుణాల రీస్ట్రక్చరింగ్‌కు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. తీవ్ర కరువు ప్రభావిత పది మండల

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 12-11-2026

# తెలంగాణ రక్షణ సేన సిక్కు మైనార్టీ విభాగం రాష్ట్ర కమిటీ నియామకం

- తెలంగాణ రాజకీయ చరిత్రలోనే మొదటిసారిగా సిక్కు విభాగానికి ప్రత్యేక కమిటీ




ఇది కద నిజం ,హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలో మొదటిసారిగా సిక్కు మైనార్టీ విభాగానికి తెలంగాణ రక్షణ సేన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. సిక్కు మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. జస్బీర్ సింగ్ సంధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్. హర్ ప్రీత్ సింగ్ ను పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించారు. బుధవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు పార్టీ చీఫ్ కవిత నియామక పత్రాలు అందజేశారు. రాజకీయ పార్టీల మైనార్టీ విభాగంలో ముస్లింలు, క్రిస్టియన్లతో పాటు సిక్కులు, ఇతర మైనార్టీలకు వివిధ పదవుల్లో అవకాశం ఇస్తారు. తెలంగాణ రక్షణ సేన మైనార్టీల్లోని ముస్లింలు, క్రిస్టియన్లకు వేర్వేరు కమిటీలు ప్రకటించగా.. ఇప్పుడు సిక్కు మైనార్టీల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. మైనార్టీల్లోని ఒక్కో సెక్షన్ సమస్యలు ఒక్కోలా ఉన్నాయి కాబట్టి వారందరికీ న్యాయం చేసేందుకే వేర్వేరు కమిటీలు ఏర్పాటు చేశామని కవిత ప్రకటించారు.

# ఆశీర్వదించి.. వీర తిలకం దిద్ది

తెలంగాణ రక్షణ సేన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభం
జెండా ఊపి ప్రచార వాహనాలు ప్రారంభించి పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత




ఇది కద నిజం ,హైదరాబాద్ :

రాజకీయ పార్టీ ఏర్పడిన తర్వాత మొదటి ఎన్నికల్లో తలపడుతున్న తెలంగాణ రక్షణ సేన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభించింది. బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆశీర్వదించి.. వీర తిలకం దిద్ది ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అంతకు ముందు హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు మత పెద్దలు సర్వమత ప్రార్థనలు చేసి ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఆశీర్వచనం అందజేశారు. వరంగల్ -- ఖమ్మం -- నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, హైదారబాద్ -- మహబూబ్ నగర్ -- రంగారెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరుకు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సహా మహిళా నాయకులు వీర తిలకం దిద్దారు. అనంతరం పార్టీ ప్రచార వాహనాలను కవిత జెండా ఊపి ప్రారంభించారు. ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్సీలుగా తిరిగి రావాలని ఆశీర్వదించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# మా అభ్యర్థులను గెలిపించండి

- కాంగ్రెస్ పార్టీ ఫ్యూజ్ ఎగిరిపోయింది.. కొత్త తరాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత రైతన్నల మీద ఉన్నది
- అధికార పార్టీకి, మొద్దు నిద్రలో ఉన్న విపక్షాలకు బుద్ధి చెప్పేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశం
- గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఓటరుగా ఎన్ రోల్ చేసుకోవాలి
- డబ్బులు తీసుకొని గ్రాడ్యుయేట్లు ఓట్లు వేస్తారన్న అపవాదును తొలగించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ప్రచారం ప్రారంభించిన కవిత




ఇది కద నిజం,హైదరాబాద్ :

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరితో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఫ్యూజ్ ఎగిరిపోయిందని.. పొలం కాడ ఫ్యూజ్ ఎగిరిపోతే రైతులు కొత్త ఫ్యూజ్ వేసినట్టు కొత్త తమ పార్టీ అభ్యర్థులకు రైతన్నలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎన్నో హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు, నిద్రావస్థలో ఉన్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విద్యావంతులు అవకాశంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్లంతా కచ్చితంగా ఓటరుగా ఎన్ రోల్ చేసుకొని ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ఆకాశ్ కొల్లూరి, నల్గొండ- ఖమ్మం- వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ ను గెలిపించాలని కోరారు.

తెలంగాణ రక్షణ సేన మహిళా నాయకులు ఈరోజు తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థులు చదువుకున్న యువకులని, ఒకరు ఉస్మానియా యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ కాగా మరొకరు కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఉద్యమకారులని చెప్పారు. వారికి పొలిటికల్ గా ఫైనాన్షియల్ గా ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేదని.. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం మాత్రం ఉందన్నారు. సామాజిక చైతన్యం కోసం ఎమ్మెల్సీ ఎన్నికల యుద్ధరంగంలోకి దిగుతున్నామని, ఆడబిడ్డలు, అన్నాదమ్ములు అందరూ తమ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయంలో భాగంగా తాము ఇద్దరు బీసీలకే అవకాశం కల్పించామన్నారు. ఆకాశ్ కొల్లూరి కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వారని.. గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా కుమ్మరి సామాజిక వర్గానికి అవకాశం కల్పించలేదని, తాము ఆ కులం నుంచి అభ్యర్థిని పోటీకి దించామన్నారు.

### డబ్బులు తీసుకుంటారనే అపవాదు తొలగించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు కూడా డబ్బులు తీసుకుని ఓటు వేస్తారన్న ఉద్దేశంలో కాంగ్రెస్ పార్టీ ఉందని అన్నారు. రెండు వందల కోట్లు ఖర్చు పెట్టయినా సరే తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముఖ్యమంత్రి చెబుతున్నాడని ధ్వజమెత్తారు. గ్రాడ్యుయేట్లు డబ్బులు తీసుకుంటారనే అపవాదు తొలగించుకోవాల్సిన అవసరముందన్నారు. గ్రాడ్యుయేట్లే డబ్బులు తీసుకోని ఓటు వేస్తే వ్యవస్థలో అవినీతి మరింత పెరుగుతుందన్నారు. తన మాటలు కఠినంగా ఉన్న సరే గ్రాడ్యుయేట్లు తమపై ఉన్న అపవాదును తొలగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 80 లక్షల మంది ఏదో ఒక డిగ్రీ ఉన్న వాళ్లేనని, వారంతా కూడా ఆలోచించి ఓటు వేయాలన్నారు. శాసన మండలిలో మొత్తం 40 మంది సభ్యులుంటే అందులో గ్రాడ్యుయేట్ల ద్వారా ఎన్నికయ్యేది ముగ్గురు మాత్రమేనని చెప్పారు. ఆ ముగ్గురిని మన కోసం పనిచేసే వాళ్లను ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. శాసన మండలిలో ప్రస్తుతం ప్రతిపక్షం లేని పరిస్థితి నెలకొందని.. బీఆర్ఎస్ సభ్యులు సగానికి పైగా కాంగ్రెస్ లో చేరిపోయారని గుర్తు చేశారు. బీజేపీ సభ్యులు కాంగ్రెస్ తో లోపాయికారి ఒప్పందంలో ఉన్నారని తెలిపారు. మండలిలో ప్రతిపక్షం యుద్ధరంగంలోకి దిగుతున్నామని, అవసరముందని.. ప్రజల కోసం గొంతెత్తే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతిపక్షంగా గ్రాడ్యుయేట్ల తరపున పోరాటం చేస్తామన్నారు

### మా అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడుతాం

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా తెలంగాణలోని మూడో వంతు ప్రాంతంలో ఎన్నికల వాతావరణం ఉందని చెప్పారు. దాదాపు 75 నియోజకవర్గాల్లో ఎన్నికలు ఉంటాయని తెలిపారు. మా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేస్తామన్నారు. ఇవ్వాళ్టి నుంచి తాము యుద్ధరంగంలోకి దిగుతున్నామన్నారు. తమ యుద్ధం ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం, నదీ జలాల సాధన కోసం, ప్రభుత్వం ఎగొట్టిన హామీల అమలు కోసం ఉంటుందన్నారు. రాష్ట్రంలో తామే ప్రతిపక్షంగా మారి ప్రతి సమస్యపై పోరాటం చేయటంతో పాటు దానికి ప్రభుత్వానికి పరిష్కారం కూడా చూపిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో భావస్వారూప్యత ఉన్న పార్టీల మద్దతు కోరుతామని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు ఉన్న లేకపోయినా సరే మా పార్టీ తరపున 33 నుంచి 50 శాతం సీట్లు ఇస్తామన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి మహిళ అభ్యర్థినే పోటీలో పెట్టాల్సి ఉన్నప్పటికీ సామాజిక న్యాయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశంతో బీసీ అభ్యర్థికి సీటు ఇచ్చామన్నారు. తమ పార్టీ గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతుందని.. ఈసీ నుంచి మంచి నిర్ణయమే వస్తుందన్న నమ్మకం ఉందని చెప్పారు. మీడియా సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్ చార్జీలు డాక్టర్ రఘు, సయ్యద్ ఇస్మాయిల్, జిల్లాల ఎన్నికల కో ఆర్డినేటర్లు గొంగళ్ల రంజిత్, అర్చనా సేనాపతి, వాసిలి చంద్రశేఖర్, రామ్ కళ్యాణ్ చల్లా, మతిన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీలో వసతి గృహాల కూల్చివేతను నిలిపివేయాలి

బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య



ఇది కద నిజం, హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలోని వసతి గృహాల కూల్చివేతను తక్షణమే నిలిపివేసి, విద్యుత్, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య నేతృత్వంలో విద్యార్థి నాయకులు ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ ప్రిపరేషన్ సాగిస్తున్న విద్యార్థులకు వసతి లేకుండా చేసి, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారిని రోడ్డున పడేసే ప్రయత్నాలను మనుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓయూ అభివృద్ధికి ఇస్తానన్న రూ.1000 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి నూతన హాస్టళ్లు, అధునాతన ల్యాబ్‌లు నిర్మించాలని కోరారు. అలాగే యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టుల భర్తీతో పాటు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని, ఓయూ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నరేష్, వంశీ, శ్రవణ్, ప్రదీప్, ఫయాజ్, చరణ్, శ్రీనివాస్ రెడ్డి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల దాతృత్వాన్ని అభినందించిన డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు



ఇది కద నిజం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంగపల్లిలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు మామిడాల యాదమ్మ మనవడు రిషికేష్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అతని కుటుంబానికి పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి మరియు రవి కుమార్ వారి బంధువులు మరియు స్నేహితులు మరియు సహ ఉపాధ్యాయుల ద్వారా సేకరించిన మొత్తం 111111-00 ఒక లక్షా పదకొండు వేల నూట పదకొండు రూపాయలు యాదగిరిగుట్ట డిఎస్పి శ్రీనివాస నాయుడు మరియు గ్రామ సర్పంచ్ ఒగ్గు రవళి రాణా ప్రతాప్ ఉప సర్పంచ్ చిన్నం మల్లయ్య చేతుల మీదుగా బాబు తల్లితండ్రులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదగిరిగుట్ట డిఎస్పి శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ తమ పాఠశాల లో పని చేస్తున్న వారిని తమ వారిగా భావించిన ఉపాధ్యాయులు మానవత్వం ఇంకా బ్రతికే ఉందని నిరూపించి అందరికీ స్ఫూర్తివంతంగా నిలిచారని అభినందించారు. సర్పంచ్ ఒగ్గు రవళి రాణా ప్రతాప్ మాట్లాడుతూ మా ఉపాధ్యాయులు వృత్తి ధర్మం తో పాటు సామాజిక బాధ్యత తో స్పందించి నలుగురికి ఆదర్శంగా నిలిచారు అని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతీ రావు యాదగిరిగుట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ మరియు ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి రవి కుమార్ పూర్ణచందర్ లీలావతి సత్యనారాయణ సుప్రిత పురుషోత్తం ఉపేంద్రా చారి శిరీష పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు



దిల్లీ,ఇది కద నిజం: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సంకల్పం వల్ల రాష్ట్రానికి 6 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు దక్కాయని ఏపీ పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానోత్సవంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్‌తో కలిసి రాష్ట్రానికి వివిధ కేటగిరీల్లో దక్కిన ఆరు అవార్డులను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. విశాఖ, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి కార్పొరేషన్‌లతో పాటు, కుప్పం మున్సిపాలిటీకి అవార్డులు లభించాయి.

### జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

స్వచ్ఛసర్వేక్షణ్ 2025-26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో జీహెచ్ఎంసీకి అవార్డు లభించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు.. అవార్డు అందుకున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్ ఈ అవార్డుకు ఎంపికైంది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం వంటి 10 ప్రధాన అంశాల ఆధారంగా జీహెచ్ఎంసీకి అవార్డు వరించింది.

# దేశంలోనే తొలి ఏఐ పోలీసు స్టేషన్‌గా పంజాగుట్ట: సజ్జనర్




హైదరాబాద్, ఇది కద నిజం: దేశంలోనే తొలి ఏఐ పోలీసు స్టేషన్‌గా పంజాగుట్ట మారనుందని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. పంజాగుట్ట పీఎస్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ఏఐ ఠాణా ప్రారంభమవుతుందని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా ఈ సరికొత్త విధానం తెస్తున్నట్లు చెప్పారు. రిసెప్షన్‌లో సేతు కియోస్క్ ఏర్పాటు, 10 భాషల్లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఏఐ ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు, కేసు డైరీ, దర్యాప్తు నివేదికలు, చార్జ్‌షీట్ రూపకల్పన ఉంటాయన్నారు. పోలీసు సిబ్బందికి దీనిపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# యాదాద్రిలో ప్రారంభమైన కార్తీక మాసం సత్యనారాయణ స్వామి వ్రతాలు

- భక్తుల రద్దీకి అనుగుణంగా 6 బ్యాచ్‌ల సంఖ్య పెంపు
- రెండో రోజు 328 మంది దంపతులతో వ్రతాలు నిర్వహణ





ఇది కద నిజం: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవంబర్ 10, 2026 నుంచి ప్రారంభమైన వ్రతాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కార్తీక మాసం కావడంతో స్వామివారి క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు వ్రతాల నిర్వహణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సాధారణ రోజుల్లో నాలుగు బ్యాచ్‌లుగా నిర్వహించే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను ఈసారి ఆరు బ్యాచ్‌లుగా పెంచారు. వ్రతం టికెట్ ధర వెయ్యి రూపాయలుగా నిర్ణయించగా, వ్రతానికి అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానం తరఫునే భక్తులకు అందజేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు వ్రతాల నిర్వహణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ఇక కార్తీక పౌర్ణమి రోజున భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం ఎనిమిది బ్యాచ్‌లుగా సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించనున్నారు.

కాగా, కార్తీక మాసం ప్రారంభమైన రెండో రోజైన బుధవారం 328 మంది దంపతులు స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్తీక మాసం సందర్భంగా యాదాద్రి క్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 12-11-2026

# సినిమా న్యూస్



## లవ్‌స్టోరీతో సిద్ధు జొన్నలగడ్డ!

టాలెంటెడ్ స్టార్ సిద్ధు జొన్నలగడ్డ మరో బ్యూటిఫుల్ లవ్‌స్టోరీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన కెరీర్‌లో మైలురాయిలా నిలిచే 10వ చిత్రంగా ఈ మూవీ రాబోతుండగా, తాజాగా, ఈ సినిమా పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్లు బుచ్చిబాబు సనా, నందిని రెడ్డి ఈ వేడుకను మరింత స్పెషల్‌గా మార్చారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ క్లాప్ కొట్టడంతో పాటు సినిమా గ్లింప్స్‌ను విడుదల చేయగా, బుచ్చిబాబు, నందిని రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఇప్పటివరకు తనదైన శైలి భిన్నమైన కథలు, అదిరిపోయే కామెడీ టైమింగ్‌తో యూత్‌లో ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న సిద్ధు జొన్నలగడ్డ.. ఇప్పుడు పూర్తిస్థాయి రొమాంటిక్ డ్రామాతో అలరించనున్నారు.

ఈ సినిమాలో సిద్ధు సరసన క్యూట్ బ్యూటీ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు మోహన్ బి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. టాలీవుడ్‌లో తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేసే జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. వైవిధ్యమైన లవ్‌స్టోరీలతో పాటు పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌లను అందించడంలో పేరున్న సుకుమార్ రైటింగ్స్, సిద్ధు జొన్నలగడ్డ కాంబినేషన్ వస్తుండటంతో సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

## కమల్‌పై కేసు!



ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు, మక్కల్ నీది మయ్యమ్ అధినేత కమల్ హాసన్‌పై తమిళనాడులో కేసు నమోదైంది. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఇటీవల ప్రకటించిన సినిమా టైటిల్ తీవ్ర వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, కుల ఘర్షణలను రెచ్చగొట్టేలా ఉద్దేశపూర్వకంగానే ఈ శీర్షికను ఎంచుకున్నారంటూ పుదియ తమిళగం పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టర్ విడుదలతో రాజుకున్న వివాదం..

అయితే, ఈనెల 7న కమల్ హాసన్ జన్మదినం సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రానికి సండియర్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అయితే, ఈ పేరు గతంలోనూ వివాదాస్పదమైందని, దీనిని ప్రకటించవద్దని తాము ముందుగానే వారించినప్పటికీ చిత్ర బృందం పెడచెవిన పెట్టిందని పుదియ తమిళగం పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ టైటిల్ దక్షిణ తమిళనాడులో కులాల మధ్య ఉద్రిక్తతలను, ఘర్షణలను రెచ్చగొట్టేలా ఉందని ఆరోపిస్తూ పుదియ తమిళగం నేతలు పోలీసులను ఆశ్రయించారు. సినిమా పేరును తక్షణమే మార్చకపోతే దక్షిణ తమిళనాడులో తీవ్రమైన అల్లర్లు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని వారు అందోళన వ్యక్తం చేస్తున్నారు. వారిచ్చిన ఫిర్యాదు ఆధారంగా కమల్ హాసన్‌తో పాటు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న అరుణ్ కుమార్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే కమల్ సినిమాలకు టైటిల్ వివాదాలు కొత్త కాకపోయినా, ఈ తాజా కేసు తమిళ రాజకీయాల్లో మరియు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## కవలల వార్తపై సమంత క్లారిటీ!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీ టైమ్‌ను ఆస్వాదిస్తూ సినిమాలకు కొద్దిగా దూరంగా ఉంటున్నారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ మెటర్నిటీ ఫొటోషూట్స్ షేర్ చేయడం, ఎంతో కష్టమైన వర్కౌట్స్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరచడం చేస్తున్నారు. ఇటీవల బెడ్‌పై పడుకొని తన బేబీ బంప్‌ను చూపిస్తూ.. ఇదే తన మెటర్నిటీ ఫొటోషూట్‌గా భావించాలని ఆమె పెట్టిన పోస్ట్ నెట్టింట క్షణాల్లో వైరల్ అయింది. అయితే ఈ పోస్ట్ పుణ్యమా అని, సోషల్ మీడియాలో కొందరు ఆకతాయిలు ఏఐ టెక్నాలజీని వాడి సమంతకు ఇద్దరు కవల పిల్లలు పుట్టినట్లు కొన్ని ఫేక్ వీడియోలు క్రియేట్ చేసి వదిలారు.

ఇక ఆ ఏఐ వీడియోలను నిజమని నమ్మిన ఒక బామ్మ.. సమంతకు డెలివరీ అయిపోయిందని, హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి కూడా వెళ్ళిపోయిందని తన మనవడితో గట్టి వాదనకు దిగింది. దీనికి సంబంధించిన ఫన్నీ వీడియో ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో తెగ ట్రెండ్ అవుతోంది. ఈ ఫన్నీ ఘటనపై స్పందించిన నటి సమంత.. ఆ వైరల్ వీడియోను చూసి 'ఇంకా లేదు అమ్మమ్మ' అంటూ చాలా సరదాగా నవ్వుతూ క్లారిటీ ఇచ్చారు. ఏఐ వీడియోలను చూసి పెద్దవాళ్ళు నిజమని నమ్ముతున్న ఈ విచిత్ర వైనంపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తుండగా, సమంత మాత్రం బామ్మ వీడియోపై చాలా క్యూట్‌గా రిప్లై ఇవ్వడం ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.



## ఆస్కార్ రేసులో 'రామాయణం'!




సినిమా ఆస్కార్ రేసులోకి ప్రవేశించబోతోందనే వార్త ఇప్పుడు నెట్టింట బాగా వైరల్ అవుతోంది. ఈ ఏడాది అత్యంత భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం గురించి లేటెస్ట్‌గా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాను ఆస్కార్ కన్సిడరేషన్ కోసం మేకర్స్ పంపించినట్లు ప్రముఖ ఓ ఛానెల్‌కు చెందిన ఎక్స్‌క్లూజివ్ రిపోర్ట్ పేర్కొంది. ఈ వార్త బయటకు రావడంతో ప్రేక్షకుల్లో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది.

అయితే ఇక్కడే చాలామందికి ఒక పెద్ద డౌట్ రావచ్చు. ఈ ఏడాది ఇప్పటికే భారత్ తరఫున 'గోంధాల్' అనే మరాఠీ సినిమా ఆస్కార్స్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిలిం క్యాటగిరీలో అఫీషియల్ ఎంట్రీగా ఎంపికైంది కదా? మరి అలాంటప్పుడు 'రామాయణం' ఎలా ఆస్కార్‌కు వెళ్తుందనే ప్రశ్న ఎదురవుతోంది. అసలు విషయం ఏంటంటే... 'గోంధాల్' భారత దేశ అధికారిక ఎంట్రీ అయినప్పటికీ, మిగతా సినిమాలు కూడా ఇండిపెండెంట్ ఎంట్రీస్ రూపంలో ఆస్కార్స్‌కు వెళ్లే అవకాశం ఉంది. అకాడమీ అవార్డ్స్ నిర్ణయించిన నిబంధనలు, క్వాలిటీరియాను అందుకుంటే ఏ సినిమానైనా ఆస్కార్ పోటీకి పంపవచ్చు. కాబట్టి 'రామాయణం: పార్ట్ 1' నిర్మాతలు ఈ సినిమాను సబ్‌మిట్ చేయడం అనేది ఇండియా అఫీషియల్ ఎంట్రీ నిర్ణయానికి ఎలాంటి విరుద్ధం కాదు. ఈ రెండు సినిమాలు కూడా తమ తమ కేటగిరీల్లో స్వతంత్రంగా పోటీపడవచ్చు.

ఇక సినిమా విషయానికొస్తే, రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, రవి దూబే , యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ 'రామాయణం' నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి రోజు బాక్సాఫీస్ దగ్గర మిశ్రమ స్పందన సాధించినప్పటికీ, ఆ తర్వాత మాత్రం పుంజుకుని దేశంలోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా అద్భుతమైన కలెక్షన్లు సాధిస్తోంది. మొదటి సోమవారం ఈ సినిమా బిజినెస్ పరంగా దూసుకెళ్లింది. ఇప్పటివరకు వరల్డ్‌వైడ్‌గా ఏకంగా 600 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించి ఆకట్టుకుంది. ఈ సినిమాలో ఉపయోగించిన విజువల్ ఎఫెక్ట్స్ పై కూడా ప్రేక్షకుల నుంచి భారీగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## 'విశ్వంభర' పనులు షురూ!




మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది.

'విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.

ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, ఆశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.